## పన్ను వసూలుపై దృష్టి సారించాలి




సిబ్బందితో మాట్లాడుతున్న బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఏప్రిల్ 16 : బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ శరత్‌చంద్ర వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాగునీరు-వార్డుల వారీగా కార్యాచరణ ప్రణాళిక, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన, ఎల్‌ఆర్‌ఎస్, అడ్వర్టైజ్‌మెంట్ పన్నుల వసూలు, పింఛన్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నుల వసూలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై సిబ్బంది నుంచి వివరాలడిగి తెలుసుకున్నారు. అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ మంజులత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, సెక్షన్ అధికారులు, అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు నాలుగు నెలల శిక్షణ

అడ్డగుట్ట, ఏప్రిల్ 16: అప్స టెక్ మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు శిక్షణ అందిస్తున్నట్లు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపి బుధవారం ప్రకటనలో తెలియజేశారు. 20 -27 ఏళ్ల వయసు గల బీఎస్సీ,ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎం ఫార్మా, బీకామ్,ఎంకామ్ ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మెడికల్ కోడింగ్‌లో (మెడికల్ టెర్మినాలజీ,హ్యూమన్ అనాటమీ, పిసియాలజీ, ఐసిడి-10 సిపిటి, హెచ్‌సీపీటీ, ఆర్‌సిఎం)బిల్లింగ్ టెర్మినాలజీ, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, ఇంగ్లిష్ టైపింగ్, కమ్యూనికేషన్ , ఇంటర్వ్యూ స్కిల్స్ లో శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు.

# ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌పై అధికారుల నజర్

- రెవెన్యూ అధికారులతో కలిసి మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అక్రమణలకు చెక్ పెట్టి వినియోగానికి చర్యలు తీసుకోవాలని ఆదేశం



ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో పర్యటిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఆర్‌డీఓ సాయిరామ్, తాసీల్దార్ నయీముద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16: రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని జీహెచ్‌ఎంసీ మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, సికింద్రాబాద్ ఆర్‌డీఓ సాయిరామ్, ఖైరతాబాద్ తాసీల్దార్ ఎండీ నయీముద్దీన్‌తో కలిసి కలెక్టర్ ఎస్పీఆర్ హిల్స్‌లోని మైదానంలో పర్యటించారు. ప్రస్తుతం 6 ఎకరాలకుపైగా ఉన్న ఈ స్థలంలో స్పోర్ట్స్ స్టేడియం లేదా ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఈ స్థలం ఉపయోగపడుతుందా? అన్న కోణంలోనూ ఆలోచించాలన్నారు. అప్పట్లో సుమారు 10 నుంచి 15 ఎకరాలకుపైగా ఉన్న ఈ క్వారీ స్థలం తరచూ దురాక్రమణలకు గురైంది. ప్రస్తుతం 9 ఎకరాలకుపైగా స్థలాన్ని రెవెన్యూ నుంచి బల్దియాకు బదలాయించారు. కాగా ఈ స్థలంలోనే జీహెచ్‌ఎంసీ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరుగుతుండగా మరో 8 ఎకరాలకు పైగా స్థలం మిగిలి ఉండాలి. అయితే ఇప్పటికే అధికారులు ఆ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించినప్పటికీ చుట్టుపక్కల బస్తీలను ఎరగా చేసుకుని కబ్జాదారులు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ మైదాన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తున్నది.

## ఎమ్మెల్సీ దాసోజుకు ఎమ్మెల్యే మాగంటి శుభాకాంక్షలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 16: శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్సీ శ్రవణ్‌కు బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కచ్చితంగా గుర్తింపు ఇస్తారనే విషయం మరోసారి నిరూపణ అయిందని ఆయన పేర్కొన్నారు.



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

### దాసోజు ప్రమాణస్వీకారానికి తరలిన బీఆర్‌ఎస్ నేతలు

బీఆర్‌ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేస్తుండటంతో బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలివెళ్లారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌తోపాటు వివిధ డివిజన్ల నాయకులు ఎమ్మెల్సీ దాసోజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్‌కు మొక్కను అందజేస్తున్న మహేశ్‌యాదవ్ తదితరులు

### ఎమ్మెల్సీ దాసోజుకు అభినందనల వెల్లువ

ఖైరతాబాద్ : ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్‌కుమార్‌కు బుధవారం సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ నేత మహేశ్‌యాదవ్, చంద్రశేఖర్, చలపతి, అమూల్ తదితరులు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు



ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారానికి తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

## రజతోత్సవ సభకు భారీగా తరలండి..

మణికొండ, ఏప్రిల్ 16 : బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలాలని ఆ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి




జలమండలి అధికారులు, మున్సిపాలిటీల కమిషనర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

బండ్లగూడ, ఏప్రిల్ 16. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులంతా కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. బుధవారం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు, జలమండలి అధికారులతో బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ తాగునీటి సమస్యపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీరందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన కార్యాచరణను రూపొందించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిధుల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీ చేయాలి




ప్లకార్డులు చూపుతున్న రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్, కంప్యూటర్ అసోసియేషన్ నాయకులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 16: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ బాలిగ డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ రెండు జంట కళల వృత్తి నైపుణ్యంలో శిక్షణ పొంది ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యో గాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. టైప్ రైటింగ్ పై ఆధారపడిన నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్రం ప్రతి నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగావకాశాలను కల్పించి ఆదు కోవాలని కోరారు. స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అర్హతగా చేర్చి నియామకాలు చేపట్టాలని కోరారు. అసోసియేషన్ నాయకులు శశిధర్, వివేక్, రామారావు, రాధ, నరేశ్ భాస్కర్, శివానంద్, శ్రీశైలం పాల్గొన్నారు.

## ఎంబీఏ జవాబు పత్రాల నకలు కోసం దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్) తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు కోసం ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. చాలెంజ్ వాల్యూయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజును వచ్చే నెల 19వ తేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 2016-17 విద్యాసంవత్సరంతో పాటు ఆ తరువాత డిగ్రీ కోర్సుల్లో చేరిన వారు ఈ వన్ టైం చాన్స్ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులని వివరించారు. సాధారణ పరీక్ష ఫీజుతో పాటు ఒక్కో పేపర్‌కు రూ.2,000 చొప్పున అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

### వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్.వై.డి. క్లినికల్ సైకాలజీ రెండు, మూడో సంవత్సరం రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ సెకండ్ పార్ట్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.


## సమస్యల పరిష్కారానికి కృషి : బీఆర్‌ఎస్



అత్తాపూర్‌లో తాగునీటి సమస్యను జలమండలి మేనేజర్ వినయ్‌కు వివరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 16: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ అత్తాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. గత కొన్ని రోజులుగా అత్తాపూర్ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై ఇటీవల జలమండలి జీఎం వినయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో బుధవారం జలమండలి మేనేజర్ వినయ్, సిబ్బంది అత్తాపూర్‌కు చేరుకుని స్థానిక మహిళలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పారెడ్డి ముఖేశ్ మాట్లాడుతూ.. తాగునీరు సక్రమంగా రాక ప్రజలకు సరిపోవడం లేదన్నారు. లోప్రెషర్ సమస్య అధికంగా ఉందన్నారు. జనాభాకనుగుణంగా నీటి పైపులైన్ల వ్యవస్థను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెషర్ పెంచి సరిపడా నీటిని ప్రజలకు అందించాలని అధికారులను కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పుప్పాల లక్ష్మణ్, మల్లేశ్ యాదవ్, జగన్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.


## సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బాధితురాలు నాగజ్యోతికి చెక్కును అందజేస్తున్న నాయకులు

మణికొండ,ఏప్రిల్ 16 సీఎం సహాయనిధిని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌కాలనీకి చెందిన కె.నాగజ్యోతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. ఆర్థిక స్థోమత సరిపోక స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నది. దాంతో ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60వేలను మంజూరు చేసింది. బుధవారం ఆ చెక్కును రామకృష్ణారెడ్డి మాజీ సర్పంచ్ యాలాల నరేశ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బి.శ్రీరాములు,డైరెక్టర్లు కుమార్, లక్ష్మీశ్రీతో కలిసి బాధితురాలికి అందజేశారు. సీఎం సహాయ నిధి పేదలకు అత్యవసర సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, విజయరెడ్డి, శివగంగ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి




మధుబన్ కాలనీలోని కిరాణా షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై పైడినాయుడు, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 16: శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి ఎస్సై పైడినాయుడు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మసూద్ ఆలీ అన్నారు. బుధవారం సాయంత్రం స్టేషన్ పరిధిలోని మధుబన్‌కాలనీలో వాహనాల తనిఖీతోపాటు కిరాణా స్టోర్స్‌లో నిషేధిత గుట్కా అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిరాణా షాపుల్లో నిషేధిత గుట్కాలు అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. రాత్రిళ్లు రోడ్లపై తిరిగే వారిపై నిఘా పెడుతున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తక్కువ ధరకే కారు అమ్ముతానంటూ 4.48 లక్షలకు టోకరా

వెంగళరావునగర్, ఏప్రిల్ 16 : తక్కువ ధరకే కారు అమ్ముతానని రూ.4.48 లక్షలకు టోకరా వేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి జయప్రకాశ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎల్లారెడ్డిగూడ జయప్రకాశ్ నగర్‌కు చెందిన షోయబ్(34) ఈనెల 14న ఓఎల్‌ఎక్స్‌లో హుండై క్రెటా కారు అమ్మకానికి ఉండటంతో కొనుగోలుకు ఆసక్తి చూపాడు. సంబంధిత వ్యక్తిని సంప్రదించాడు. తనకు తాను సీలం సాంబశివరావుగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి కారు ఫొటోలను వాట్సాప్ ద్వారా పంపించాడు. కారు మాసాబ్‌ట్యాంక్ వద్ద ఉందని, లోకేషన్ షేర్ చేశాడు. అక్కడ తన సోదరుడు సర్ఫరాజ్ ఉంటాడని చెప్పడంతో షోయబ్ మాసాబ్ ట్యాంక్‌కు వెళ్లాడు. అక్కడ సర్ఫరాజ్ అనే వ్యక్తి కారు చూపించాడు. సాయంత్రం సాంబశివరావు షోయబ్‌కు కాల్ చేసి అవసరాల నిమిత్తం కారును తక్కువ ధరకు రూ. 4,48,000లకే అమ్ముతున్నట్లు చెప్పడంతో అతడి మాటలు నమ్మి డబ్బును ఫోన్ పే ద్వారా చెల్లించాడు. కారును తన సోదరుడు సర్ఫరాజ్ అప్పజెప్తాడని చెప్పాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి సర్ఫరాజ్‌కు కాల్ చేయగా తనకు సాంబశివరావు ఎవరో తెలియదని, కేవలం తాను ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన ఇచ్చానని చెప్పాడు. దాంతో ఖంగుతున్న షోయబ్ వెంటనే మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## ఆలయంలో పూజలు



వెంగళరావునగర్, ఏప్రిల్ 16 : పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలోని శ్రీ గణేశ్ దేవస్థానం(సిద్ధి గణపతి)లో బుధవారం కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ రవిశేఖర్‌రెడ్డిని ఈవో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## దిగులు పడొద్దు.. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్‌దే హవా..!



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ (హైదరాబాద్), ఏప్రిల్ 16 : భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ హవా కొనసాగుతుందని.. కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు పటోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ సులేమాన్ నగర్, శాస్త్రిపురం డివిజన్ల ముఖ్యకార్యకర్తల సమావేశం డైరీఫామ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బహిరంగ సభకు ముస్లింలు ప్రధానంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలు పునిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ వచ్చాకే రాష్ట్ర అభివృద్ధి కోసం, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వ మేనని, కార్యకర్తలెవరూ దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో హామీలను అమలు చేయలేదని అన్నారు. కాలయాపన చేస్తే ప్రజలు కాంగ్రె స్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రధానంగా శాస్త్రిపురం, సులేమాన్ నగర్ డివిజన్లలో మురికివాడలను అభివృద్ధి చేసిన ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ముస్లింలకు షాదీ ముబారక్ వంటి అనేక పథకాలు అమలు చేశారని తెలిపారు. పార్టీ 25 వసంతాలు పూర్తి చేసకున్నందున ఈనెల 27న వరంగల్‌లో తలపెట్టిన ప్లినరీ సమావేశానికి డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రావాలని సూచించారు. సమావేశంలో లోసులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ జహీరుద్దీన్, శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షుడు ముక్రమ్‌ఖాన్, నాయకులు అబ్దుల్ రెహమాన్ అహ్మద్ పటేల్, అదిరాల రవి, ఎండీ అలీ, అసిఫ్, సైద్‌అమీర్, షాజాది, సోహెల్, షరీఫ్, ఇమ్రాన్ పటేల్, అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## 18న మహాధర్నాకు బీసీలు తరలిరావాలి



హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతున్న నరేందర్‌గౌడ్

హిమాయత్ నగర్,ఏప్రిల్ 16: రాష్ట్రంలోని బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న ఇందిరా పార్కు వద్ద ధర్నాచౌక్‌లో బీసీల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంపద సృష్టించే ప్రజలకు దాన్ని అనుభవించే హక్కు దక్కడం లేదన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలోని బీసీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలు మరింత చైతన్యవంతులై రాజకీయంగా శాసించేస్థాయికి ఎదగాలని పిలుపుని చ్చారు. ధర్నాకు మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తదితర రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నేతలను ఆహ్వానించినట్లు తెలిపారు.

సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి భిక్షపతిగౌడ్, అధికార ప్రతినిధి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ బీఈ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (సీబీసీఎస్) ఏఐసీటీఈ కోర్సులు, బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి రెండు వారాల తర్వాత పొందవచ్చు అని చెప్పారు. ఈ రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ. 800 చొప్పున చెల్లించి ఈ నెల 26వ తేదీలోగా టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్ కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 28 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు ఎం. నర్సింహ, తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : శంషాబాద్‌లో ఈ నెల 21,22న నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ పిలుపునిచ్చారు. బుధవారం శంషాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలో నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు 10 కోట్ల మందికిపైగా ఉంటారని అన్నారు. కార్మికుల పోరాటంతో సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ నిధులను ఇతర రంగాలకు మళ్లిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ రంగంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సెస్సు డబ్బులను తెలంగాణలో నేటికీ బదలాయించలేదన్నారు.

### మే 20న దేశవ్యాప్త సమ్మె

కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చేస్తున్న చట్టాలపై మే 20న కార్మికుల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, గౌరవాధ్యక్షుడు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి,కార్యదర్శి నర్సింహారెడ్డి, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని పాఠశాల సీజ్



బండ్లగూడ, ఏప్రిల్ 16 : రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలోని ఓ ప్రైవేటు స్కూల్‌ను మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ బుధవారం సీజ్ చేశారు. శివరాంపల్లిలోని గౌతమ్ మోడల్ స్కూల్ యాజమాన్యం అనుమతుల్లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డొనేషన్లు వసూలు చేస్తున్నారని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రతినిధి రమేశ్‌గౌడ్ ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎంఈఓ, సిబ్బందితో చేరుకుని పాఠశాలను సీజ్ చేశారు.

## హెరాయిన్, గంజాయి విక్రేత అరెస్ట్

బండ్లగూడ, ఏప్రిల్ 16 పుప్పాలగూడలో హెరాయిన్, గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జీ. దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో బుధవారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తి హెరాయిన్, గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని 200 గ్రాముల గంజాయి, 20 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## నియామకం



యాదవ సంఘం ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మల్లికార్జునయాదవ్ ఎన్నికయ్యారు. బుధవారం నగర అధ్యక్షుడు బోయిన వెంకటేశ్‌యాదవ్, చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్ యాదవ్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. - ఖైరతాబాద్